అలంకారప్రాయంగా అంగన్‌వాడీ కేంద్రం




కెరమెరి మండలంలోని పిట్టగూడ గ్రామంలో మూడేళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం ఎరువుల గోదాంలా మారింది. రూ.5 లక్షలతో నిర్మించిన ఈ కేంద్రం నేటికీ ప్రారంభించలేదు. అధికారులు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించి మరిచిపోగా ఇందులో ఉన్న రెండు గదుల్లోనూ ఎరువులు నిండి ఉన్నాయి. భవనానికి ఆనుకుని మరుగుదొడ్డి కూడా నిర్మించారు. మండలంలో సుమారు 30 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. ఓవైపు భవనాలు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు ఉన్న భవనాన్ని వినియోగంలోకి తీసుకురాకుండా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు.

- కెరమెరి

ఇదేమి దారి..!



బెజ్జూర్: మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయానికి సరైన దారి లేక ఉపాధ్యాయులు, ఇతర పనులపై వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో రోడ్డు పూర్తిగా చిత్తడిగా మారి నడవడానికి కూడా పనికి రాకుండా పోయింది. ప్రధాన రహదారికి దాదాపు 100 నుంచి 150 మీటర్ల దూరంలో ఉన్న కార్యాలయానికి ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఈ దారి వెంబడే ఎంఆర్‌సీ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. మండల విద్యాధికారి కార్యాలయం దారి ఇలా ఉంటే.. ఇక మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే దారులు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అంధకారంగా సీతాపతి రోడ్డు



కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సీతాపతిరోడ్డు నుంచి వినయ్ గార్డెన్ సమీపంలోని ప్రధాన బీటీ రోడ్డు వరకు వారం రోజులుగా వీధి దీపాలు వెలుగక రహదారి అంధకారంగా మారింది. ఈ రోడ్డు గుండా నిత్యం ప్రజలు రాత్రివేళ రాకపోకలు సాగిస్తుంటారు. అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తే చీకట్లోనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ శివాలయం వెనకాల, గోండుగూడ, చిత్రకుంటరోడ్డు ఏరియాలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లైన్‌లో కొత్త లైన్ ఏబీ స్విచ్ ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రేపు ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చారిగాం గ్రామంలో సోమవారం శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరు కావాలని శనివారం ఆయనను కలిసి కోరారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కెరమెరి: మండలంలోని మోడి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న హిందీ(ఒప్పంద ప్రాతిపదికన) సీఆర్‌టీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో ప్రవీణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తులను కేజీబీవీలో అందజేయాలని పేర్కొన్నారు.

ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

కెరమెరి: మండలంలోని మోడి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఇంటర్మీడియెట్‌లో మిగిలిన బైపీసీ, ఎంపీసీ సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు ఎస్.ప్రవీణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ నెల 10వరకు అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

కౌటాల: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. ఖేలో ఇండియా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను స్థానిక కేజీబీవీలో శనివారం ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థినులు శైలజా, సంధ్య, జాన్వి, కేత, దీక్ష, సుప్రియలు హైదరాబాద్‌లో జరిగిన ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి బహుమతులు గెలిచినట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

రెబ్బెన: మండలంలోని గొల్లగూడ వద్ద లోడ్ చేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. గొల్లగూడ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి వద్ద నుంచి లారీ ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు శనివారం అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు తెలిపారు. లారీ, జేసీబీలను సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. మండలంలోని వాగుల నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

నిరాహార దీక్ష విజయవంతం చేయండి

కాగజ్‌నగర్‌టౌన్: బీసీ బిల్లు కోసం ఎమ్మెల్సీ కవిత ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు ఢిల్లీలోని ఇందిరా పార్కులో ధర్నా చౌక్ వద్ద చేపట్టనున్న నిరాహార దీక్షకు అధిక సంఖ్యలో నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని వసుంధర డిగ్రీ కళాశాలలో నిరాహార దీక్షకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

వ్యవసాయంలో సబ్సిడీ బంద్

- ఏడేళ్లుగా నిలిచిన 'యంత్రలక్ష్మి'
- మూడేళ్లుగా విత్తన పంపిణీలోనూ కోత
- ఆర్థికంగా చితికిపోతున్న అన్నదాత



బారేమోడిలో పత్తిలో అరకపడుతున్న రైతు

కెరమెరి: రైతులకు వెన్నుదన్నుగా నిలిచే వ్యవసాయ సబ్సిడీ పథకాలకు ప్రభుత్వం మంగళం పాడడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్లుగా రైతులకు యంత్రాలను అందించాలని కర్షకులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నప్పటికీ పట్టించుకోవడంలేదని ఆరోపణలు విన్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేయడం లేదు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా యంత్రపరికరాల పంపిణీపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీల్లో 8210 మంది రైతులు ఉండగా 29,321 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. అందులో ఈ ఏడాది 26,230 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు.

పెరిగిన ధరలతో నిరాశ..

అన్నదాతలకు వ్యవసాయం పెను భారంగా మారింది. అమాంతంగా పెరిగిన ధరలతో నిరాశ చెందుతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలు వేయాలని రైతులకు సూచనలు ఇస్తేందే తప్పా సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందించడం లేదు. దీంతో రైతులు వ్యవసాయంపై నిరాసక్తి కనబరుస్తున్నారు.

యంత్రలక్ష్మికి నిధులు కరువు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సాగులో యంత్రీకరణ తెచ్చేందుకు ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు రాయితీపై ట్రాక్టర్లు, రోటవేటర్లు, నాగళ్లు, పవర్ స్ప్రేలు తదితర పరికరాలను రాయితీపై అందించేందుకు యంత్రలక్ష్మి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెల్సిందే. కాగా ఈ పథకానికి నిధులు లేక 2018 నుంచి నిలిపివేశారు. రెండేళ్లుగా విత్తనాల్లోనూ రాయితీ నిలిపివేసింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసి అన్నదాతలు ఆర్థికంగా చితికిపోతున్నారు.

పరికరాలు అందించాలి



ప్రభుత్వం వ్యవసాయ యంత్రాలను రైతులకు అందించాలి. వ్యవసాయ పరికరాలు అందక ఇబ్బందులు పడుతున్నాం. గతంలో వ్యవసాయ శాఖ నుంచి వివిధ రకాల పరికరాలు అందించేవారు. ఇప్పుడు ఆర్థికంగా తిప్పలు పడుతున్నాం.

– సోనేరావు, రైతు, కెరమెరి

ఆదేశాలు లేవు..



ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి వ్యవసాయ పరికరాలు అందలేదు. రెండు నెలల్లో వచ్చే అవకాశం ఉంది. అవి రాగానే రైతులకు అందజేస్తాం. యంత్రలక్ష్మి పథకం కొన్నేళ్ల నుంచి నిలిచిపోయింది. ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

– యుగేందర్, ఏవో

'నాణ్యమైన విద్యుత్ అందిస్తాం'



ప్రత్యేక బ్రేకర్ ప్రారంభిస్తున్న ఎస్ఈ శేషారావు

దహెగాం: రైతులకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ రాథోడ్ శేషారావు అన్నారు. శనివారం మండలంలోని చినరాస్పెల్లి గ్రామ శివారులోని సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బ్రేకర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక బ్రేకర్ ఏర్పాటు వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదన్నారు. ఆయన వెంట ఏడీఈ ఆపరేషన్ శ్రీనివాస్, ఏడీ ప్రొటెక్షన్ సంతోష్‌కుమార్, ఏఈ రవీందర్ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో అల్బర్ట్

పెంచికల్‌పేట్: డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అల్బర్ట్ అన్నారు. మండలంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎస్‌బీఐ ఆర్ఎస్ఈటీఐ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకంలో వంద రోజుల పనులు చేసిన కూలీలకు ఈడీపీ స్వయం ఉపాధి కోసం శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం కూలీలకు స్వయం ఉపాధి కల్పించడానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో సతీశ్, డీఆర్‌పీ ఆనంద్, సిబ్బంది సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సదస్సు జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దహెగాం: పింఛన్లు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీశైలం అన్నారు. ఈనెల 4న జిల్లా కేంద్రంలో సన్నాహక సదస్సుకు సంబంధించిన పోస్టర్లను శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం దివ్యాంగులకు రూ.6 వేలు, చేయూత పింఛన్‌దారులకు రూ.4 వేలు, కండరాలు క్షీణించిన వారికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు మంద కృష్ణమాదిగ హాజరవుతారని తెలిపారు. నాయకులు వెంకటేశ్, జనార్దన్, రాజు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలు అగర్‌గూడ, గుండెపల్లి, కమ్మర్‌గాం, నందిగామ, మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు పాలె సంతోష్, పాగిడి కాంతారావు ఐటీడీఏ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, ఇందిరమ్మ ఇళ్లు, సీసీరోడ్ల నిర్మాణ పనులను సాగనివ్వడం లేదని తెలిపారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నారు వేసి... ఎరువు చల్లి..



కాగజ్‌నగర్‌రూరల్: వ్యవసాయంపై మక్కువ ఉన్న ఏఈవో పొలంలో దిగి నారు వేసి... ఎరువు చల్లారు. మండలంలోని జంబుగ క్లస్టర్ పరిధిలోని ఏఈవో దుర్గాభవాని శనివారం జంబుగ గ్రామంలో రైతులు వరి నాట్లు వేస్తుండగా అక్కడికి చేరుకుని పొలంలోకి దిగి నారు వేసి ఎరువు చల్లారు.

'సింహగర్జన' విజయవంతం చేయాలి

కౌటాల: వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు ఆసరా పింఛన్‌దారుల సింహగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఇగురపు విఠల్ అన్నారు. శనివారం మండలంలోని తుమ్మిడిహెటి గ్రామంలో స్థానిక పింఛన్‌దారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వంట సరుకుల్లో నాణ్యత ఉండాలి



సరుకులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: వంట చేసే సరుకుల్లో నాణ్యత ఉండాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. శనివారం మండలంలోని మోడి కేజీబీవీని సందర్శించారు. టీచర్లు, విద్యార్థినుల హాజరు పట్టికలు, స్టాక్ రిజిష్టర్లను, వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. భోజనంలో పోషక విలువలు కలిగిన ఆహారం పెట్టాలన్నారు. అభ్యసన సామార్థ్యాలను పరీక్షించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎస్‌వో ప్రవీణను ఆదేశించారు. అనంతరం అంతాపూర్ గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు.

కార్డులు సద్వినియోగం చేసుకోవాలి



రెబ్బెన: కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అడిషనల్ కలెక్టర్ డేవిడ్

రెబ్బెన: కొత్తగా రేషన్‌కార్డులు పొందిన లబ్ధిదారులు వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో కొత్తగా 718, కుటుంబ సభ్యుల పేర్ల చేర్పులతో మరో 1,233 రేషన్‌కార్డులు మంజూరు కావడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం త్వరగా శాశ్వతకార్డులు మంజూరు చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ.. రేషన్ బియ్యం అమ్ముకునే వారి రేషన్‌కార్డులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆర్డీవో లోకేశ్వర్‌రావు, తహసీల్దార్ సూర్యప్రకాశ్, ఎంపీడీవో శంకరమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, ఆర్టీఏ మెంబర్ లావుడ్య రమేశ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

వాంకిడి: రేషన్‌కార్డుల పంపణీ నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలానికి 1,892 నూతన రేషన్‌కార్డులు మంజూరైనట్లు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తహసీల్దార్ కవిత, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు శ్యాంనాయక్, గుర్నులె నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని రాస్పెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు బెల్లంపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నాలుగు సైకిళ్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాగజ్‌నగర్‌రూరల్ సీఐ కుమారస్వామి, లయన్స్ క్లబ్ కొత్తపేట ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ బెల్లంపల్లి అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సామాజిక కార్యకర్త సిద్దులు హాజరయ్యారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు విద్యపై శ్రద్ధ వహించాలని, పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్, రాస్పెల్లి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సాయి, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, నాగరాణి, సత్యనారాయణ, రవికుమార్, స్వామి, హస్మి, వనిత, సీఆర్పీ వార్ల ఉమేశ్, యువకులు ఉమాకాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలి



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెంటుబాయి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం జిల్లా కేంద్రంలోని రాజంపేట-2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ ముర్రిపాలలో వ్యాధినిరోధక శక్తి ఉంటుందన్నారు. బిడ్డకు తల్లిపాలు తాగించడం వల్ల బిడ్డకు చాలా వరకు వ్యాధులు దూరం కాగా, తల్లికి సైతం రొమ్ము క్యాన్సర్ నుంచి కాపాడుతుందన్నారు. వైద్యురాలు డాక్టర్ కీర్తి, అంగన్‌వాడీ టీచర్లు వనిత, సునీత, తల్లులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తున్న జోషి

వాంకిడి: బ్యాంకుల ద్వారా అందిస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ జోషి అన్నారు. శనివారం మండలంలోని సవాతి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు బ్యాంకుల్లో ఖాతాలు కలిగి ఉండాలన్నారు. ఖాతా కలిగి ఉన్న వారు నిత్యం లావాదేవీ లు జరపాలని సూచించారు. బ్యాంకుల ద్వారా అతి తక్కువ ప్రీమియంతో బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పకూడదని, బెదిరింపులకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ నందకిషోర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ, విద్యా రంగాల్లో వర్గీకరణ అమలు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల వర్గీకరణకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, విద్యా రంగాల్లో వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీకి వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కేశవరావు మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలన్నారు. ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, జయేందర్, నాయకులు పాల్గొన్నారు.